క్లుప్తంగా

రైతు భరోసా కేంద్రాల పరిశీలన



మాట్లాడుతున్న శివకుమార్, హైమావతి

సైదాపురం : మండలంలోని అనంతమడుగు, పాలూరు, లింగసముద్రంలోని రైతు భరోసా కేంద్రాలను సొసైటీ అధ్యక్షుడు జి.శివకుమార్, ఏఓ పి.హైమావతి మంగళవారం పరిశీలించారు. శివకుమార్ మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఏఓ మాట్లాడుతూ కొత్తగా భూమి కొనుగోలు చేసిన వారు పాసు పుస్తకాలతో ఆర్బీకేకు వెళ్లి వైఎస్సార్ రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే పంట నమోదును తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని స్పష్టం చేశారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం



దళితకాలనీకి నిర్మిస్తున్న రోడ్డు

పెళ్లకూరు : మండలంలోని నెలబల్లి గ్రామం నుంచి దళితకాలనీకి వెళ్లే మార్గంలో సీసీ రోడ్డు నిర్మాణానికి మంగళవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మంజూరు చేయించిన రూ.15లక్షలతో నిర్మించనున్న రోడ్డుకు ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్ రెడ్డి, పీఆర్ డీఈ రమణయ్య శ్రీకారం చుట్టారు. దశాబ్దాల కలను సాకారం చేస్తున్న శేఖర్‌రెడ్డికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

ఫార్మా ఉద్యోగుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

నాయుడుపేటటౌన్ : మేనకూరు సెజ్ పరిధిలోని డెల్టా బయో ఫార్మా పరిశ్రమ ఉద్యోగులు మంగళవారం నేషనల్ సీజీఎంపీ డే సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కంపెనీ జీఎం ఆళగుదురై మాట్లాడుతూ మందుల తయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ మేరకు ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో క్వాలిటీ హెడ్ వెంకటేశన్, హెచ్‌ఆర్ హెడ్ హెచ్‌కేఓ ప్రసాద్, వీరభద్ర, ప్రదీప్, చంద్రశేఖర్, అమితేష్ పాల్గొన్నారు.

రెజ్లింగ్ జిల్లా జట్టుకు ఆరుగురు విద్యార్థులు



పోటీలో తలపడుతున్న విద్యార్థులు

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని అంబేడ్కర్ బాలుర గురుకులం వద్ద మంగళవారం నిర్వహించిన రెజ్లింగ్ పోటీల్లో జిల్లా జట్టుకు ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.సురేష్ తెలిపారు. వీరు ఈ నెల 12వ తేదీన కాకినాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి బి.ఉదయ్‌కుమార్, ప్రిన్సిపల్ మల్లికార్జున, పీటీ, పీడీలు భాస్కర్, హరి, ప్రసాద్ పాల్గొన్నారు.

మల్లాం ఆలయంలో అన్నదానం

చిట్టమూరు : మల్లాంలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో మంగళవారం అన్నదానం నిర్వహించారు. తొలుత స్వామివారికి అర్చకుడు భానుప్రకాష్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకం జరిపించారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మధ్యాహ్నం కోట మండలం గూడలి గ్రామానికి చెందిన చల్లా హరికిషోర్, రాజ్యలక్ష్మి దంపతులు ఉభయకర్తలుగా భక్తులకు అన్నదానం చేపట్టారు.

కండలేరులో 11.663 టీఎంసీలు

రాపూరు : కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 11.663 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి 50 క్యూసెక్కులు, లోలెవల్ స్లూయిస్‌కు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదలచేస్తున్నట్లు వివరించారు.

వైఎస్సార్ బీమా కింద సాయం

వెంకటగిరిరూరల్ : పట్టణంలోని నరసింహారావు వీధికి చెందిన పరుచూరి భరత్‌కుమార్ కిడ్నీవ్యాధితో ఈనెల 8వ తేదీన మృతి చెందాడు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం వైఎస్సార్ బీమా కింద రూ.90వేలు అందజేసింది. కౌన్సిలర్ శంకరయ్య చొరవతీసుకుని నామినీ ఖాతాలో నగదు జమ చేయించారు.

వెంకటగిరివాసికి డాక్టరేట్



వెంకటేశ్వర్లు

వెంకటగిరిరూరల్ : తిరుపతి ఎస్వీయూలో వృక్ష శాస్త్రంలో పరిశోధనకు గాను వెంకటగిరికి చెందిన ఎస్.వెంకటేశ్వరరావుకు డాక్టరేట్ లభించింది. మంగళవారం ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

'సురక్ష'.. అందరికీ ఆరోగ్య రక్ష

ఆరోగ్యాంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం 'జగనన్న ఆరోగ్య సురక్ష'ను చిత్తశుద్ధితో అమలు చేస్తోంది. ఎక్కడికక్కడ పకడ్బందీగా హెల్త్ క్యాంపులు నిర్వహిస్తోంది. ముందుగా వలంటీర్ల ద్వారా పంపిణీ చేసిన టోకెన్ల ఆధారంగా వ్యాధిగ్రస్తులకు చికిత్సలందిస్తోంది. ఈక్రమంలోనే నిపుణులైన వైద్యుల సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. రోగులకు అవసరమైన మందులను సైతం ఉచితంగా పంపిణీ చేస్తోంది.

- సచివాలయాల పరిధిలో హెల్త్ క్యాంపులు
- వ్యాధిగ్రస్తులకు పక్కాగా పరీక్షలు
- నిపుణులైన వైద్యులతో చికిత్సలు
- ఉచితంగా మందుల పంపిణీ



నాయుడుపేట : మందులు, ఆయుష్మాన్ భారత్ కార్డులు అందిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



రాపూరు : మందులు అందిస్తున్న వైద్యులు

నాయుడుపేట : మండలంలోని విన్నమాల సచివాలయ పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కింద వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు రూ.5లక్షల విలువైన వైద్యసేవలు అందించారు. అవసరమైన వారికి మందులతో పాటు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కె.ధనలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, వైద్యులు లియోనా, ప్రణవి, శంకరయ్య, హఫీజ్, తహసీల్దార్ రాజేంద్ర, ఎంపీడీఓ శివప్రసాద్, సర్పంచ్ వి.సోమ శేఖర్, కార్యదర్శి మాల్యాద్రిరావు, వెల్ఫేర్ కార్యదర్శి పరమశివం పాల్గొన్నారు.

రాపూరు : మండలంలోని శానాయిపాళెంలో జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. ఎంపీడీఓ అప్పాజీ, సర్పంచ్ విష్ణుప్రియ, వైద్యులు చందన్ రెడ్డి, నర్మదాదేవి, ప్రమీల, రాజకుమారి, సూర్య ధర్మేంద్ర పాల్గొన్నారు.

సైదాపురం : మండలంలోని తురిమెర్లలో ఆరోగ్య సురక్ష కింద వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీడీఓ మీసాల వెంకటేశ్వర్లు, సొసైటీ మాజీ అధ్యక్షుడు శ్రీనివాసులునాయుడు, సర్పంచ్ అడసనపల్లి జయమ్మ, వైద్యులు శ్రీధర్ ,శ్రావణి, శాంతి, వివేక్, గురవయ్య పాల్గొన్నారు.

పెళ్లకూరు : మండలంలోని కానూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష కింద వైద్య శిబిరం నిర్వహించారు. కానూరుతో పాటు పెన్నేపల్లె, రాజుపాళెం నుంచి వచ్చిన పలువురు రోగులకు చికిత్సలందించారు. ఎంపీడీఓ సురేష్ బాబు , వైస్ ఎంపీపీ సుధారాణి, వైఎస్సార్ సీపీ నేత వెంకమరాజు, వైద్యులు సుజాత, చంద్రమోహన్‌రెడ్డి, ఉమా,రాజశేఖర్, సందీప్, విష్ణుప్రియ, శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి శ్రీహరి పాల్గొన్నారు.

నేడు చిల్లకూరులో..

చిల్లకూరు ప్రభుత్వ పాఠశాలలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సురేష్‌బాబు తెలిపారు.

దొరవారిసత్రం : మండలంలోని నెలబల్లి సచివాలయం వద్ద సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైస్ ఎంపీపీ దువ్వూరు గోపాల్‌రెడ్డి, తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డి, ఏఓ రఘురామయ్య, వైద్యాధికారి చైతన్య, స్థానిక నేత సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓజిలి: మండలంలోని ఆర్మేనిపాడు సచివాలయ ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ రజనీకాంత్, జెడ్పీటీసీ సభ్యుడు రవీంద్రరాజు, సర్పంచ్ పోలయ్య, ఉప సర్పంచ్ సుకుమార్‌రాజు, వైఎస్సార్‌సీపీ నేత కొండూరు వెంకటసుబ్బరాజు, డాక్టర్ మాధవ్, పంచాయతీ కార్యదర్శి పెద్ద మస్తానయ్య పాల్గొన్నారు.

సూళ్లూరుపేట రూరల్ : మండలంలోని కోటపోలూరు సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహించారు. సుమారు 365 మందికి చికిత్సలందించారు. వృద్ధులకు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. మెడికల్ ఆఫీసర్ ఎస్.రమణయ్య మాట్లాడుతూ ఇలుపూరు, కొమ్మినేనిపల్లె, కొల్లపట్టు, మంగళంపాడు, పెద్దపడవ, కేసీఎస్‌గుంట, కోటపోలూరు-2, కొరిడి గ్రామాల్లో సురక్ష సర్వే చేపట్టినట్లు వెల్లడించారు. సర్పంచ్ అరుణ, వైఎస్సార్‌సీపీ నేత బద్దెపూడి మోహన్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

వాకాడు : మండలంలోని కొండూరు ఆరోగ్య సురక్ష కింద వైద్య శిబిరం నిర్వహించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రౌతు రామకృష్ణ, వాలమేడు సర్పంచ్ రౌతు శంకరమ్మ, ఎస్.భూదేవమ్మ పాల్గొన్నారు.

చిట్టమూరు : మండలంలోని అరవపాళెంలో వైద్యశిబిరం నిర్వహించి ప్రజలకు చికిత్సలందించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ షాలెట్, వైఎస్సార్‌సీపీ నేతలు పెళ్లూరు కరుణాకర్ రెడ్డి, దువ్వూరు సురేంద్రరెడ్డి, పేట కస్తూర్ రెడ్డి, రఘురామిరెడ్డి, దువ్వూరు వేణురెడ్డి, వైద్యులు పద్మావతి పాల్గొన్నారు.

చిల్లకూరు : మండలంలోని మోమిడిలో వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీడీఓ నిర్మలాదేవి, ఈఓపీఆర్‌డీ మాణిక్యం, సర్పంచ్‌లు ఈదూరు లావణ్య, ఇరగరాజు ఏడుకొండలు పాల్గొన్నారు.

వెంకటగిరిరూరల్ : అమ్మపాళెంలో సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేశారు. ఎంపీడీఓ విజయలక్ష్మి, డీఎల్‌డీఓ వాణి, వైద్యులు పల్లవి, రెడ్డి ప్రసాద్, శ్వేత, ధనుంజయ, నారాయణమ్మ పాల్గొన్నారు.



సైదాపురం : మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది



దొరవారిసత్రం : రోగుల వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది



చిట్టమూరు : జగనన్న ఆరోగ్య సురక్ష కిట్ అందిస్తున్న ఎంపీడీఓ షాలెట్



చిల్లకూరు : వృద్ధునికి కళ్లజోడు అందిస్తున్న సర్పంచ్

ఒత్తిడిని జయిస్తేనే విజయం

నాయుడుపేట : మానసిక ఒత్తిడిని జయిస్తేనే జీవితంలో విజయం సాధించగలమని జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి సంయుక్త తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో న్యాయమూర్తి మాట్లాడుతూ మానసిక రుగ్మతలతో బాధపడేవారు తొలుత వైద్యులను సంప్రదించాలని సూచించారు. పలువురు విద్యార్థులు ఒత్తిడికి లోనై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని కోరారు. ప్రజలకు న్యాయ పరమైన సలహాలు అందించడంతో పాటు వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకే న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. అనంతరం మెరుగైన వైద్యసేవలందిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రకళతోపాటు పలువురు డాక్టర్లను ఘనంగా సత్కరించారు. ప్రభుత్వాస్పత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్న బాలింతలకు బేబీ కిట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీపీ స్వాతి రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిషోర్, న్యాయవాదులు వి.పార్థసారథిరెడ్డి, సీహెచ్ కుమార్, పి.చెంగయ్య, షేక్ రఫీ, వైద్యులు అమర్‌నాథ్, వెంకటరత్నం, శ్రీధర్ పాల్గొన్నారు.



బాలింతకు బేబీ కిట్ అందిస్తున్న న్యాయమూర్తి సంయుక్త

భక్తిభావంతో జెండా పండుగ

గూడూరురూరల్ : దసరా సందర్భంగా పట్టణంలోని నిర్వహించే జెండా పండుగను భక్తిభావంతో నిర్వహించుకోవాలని డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం కోనేటి మిట్టలోని సీఆర్ మార్టులో ఉత్సవ కమిటీతో ఆయన సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ పండుగను అత్యంత వైభవంగా జరుపుకోవాలని సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సహకరించాలని కోరారు. జెండా ఉత్సవం జరిగే సమయంలో హోర్డింగ్‌లు అడ్డురాకుండా చూసుకోవాలన్నారు. ఎక్కడ గొడవలు జరిగినా ఉత్సవ కమిటీనే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే రౌడీ షీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. జెండా నిలిచే ప్రాంతంలో కమిటీ సభ్యులుగా పదిమంది ఉండాలని, అందరి ఆధార్‌కార్డులు పోలీస్‌స్టేషన్‌లో ఇవ్వాలని ఆదేశించారు. ఉత్సవానికి 400 పోలీసులతో బందో బస్తు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో సీఐలు హజరత్‌బాబు, వెంకటేశ్వరరావు, ఎస్ఐలు పవన్‌కుమార్, కృష్ణమూర్తి, రామారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ సూర్యనారాయణ



సర్కారు బడి.. స్మార్ట్ బోధన

విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రణాళికాబద్ధంగా కార్యాచరణ అమలు చేస్తోంది. అత్యాధునిక సాంకేతికతను అందుబాటులోకి తీసుకువచ్చింది. సర్కారు పాఠశాలల్లోని విద్యార్థులకు అత్యుత్తమంగా పాఠ్యాంశాలు బోధించేందుకు చర్యలు చేపట్టింది. పోటీ ప్రపంచంలో దీటుగా నిలబడేలా డిజిటల్ క్లాస్‌రూమ్‌లను ప్రారంభించింది. స్మార్ట్ టీవీల ద్వారా సులువుగా పాఠ్యాంశాలు అర్థం చేసుకునే వెసులుబాటు కల్పించింది. ఈ క్రమంలో పిల్లల అభ్యసన సామర్థ్యాలను సగర్వంగా పెంపొందిస్తోంది.

- విద్యాప్రమాణాలు పెంచేలా డిజిటల్ పాఠాలు
- అందుబాటులో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం
- పోటీ ప్రపంచంలో దీటుగా నిలబెట్టేలా అభ్యసన సామర్థ్యాలు
- కార్పొరేట్‌ను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలలు

గూడూరులోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఐఎఫ్‌పీ ద్వారా విద్యాబోధన



గూడూరురూరల్ : ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి సాంకేతిక మార్పులకు అనుగుణంగా ప్రభుత్వం విద్యారంగంలో వివిధ సంస్కరణకు శ్రీకారం చుట్టింది. దేశంలోనే తొలిసారిగా సర్కారు పాఠశాలల్లో డిజిటల్ హంగులు సమకూర్చి అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యా బోధన ప్రారంభించింది. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ (ఐఎఫ్‌పీ), స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేసి విద్యార్థులకు నాణ్యమైన బోధనను అందుబాటులోకి తీసుకొచ్చింది. గూడూరు నియోజకవర్గంలోని గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో మొదటి విడత కింద 35 హైస్కూళ్లు, 91 ప్రాథమిక పాఠశాలలకు 176 ఐఎఫ్‌పీ, 51 స్మార్ట్ టీవీలను అందజేసింది. ఇందుకోసం ఒక్కో ఐఎఫ్‌పీకి రూ.3.5 లక్షలు, స్మార్ట్ టీవీకి రూ.1.5లక్షలు వెచ్చించింది.

నాణ్యమైన బోధన

ప్రభుత్వ పాఠశాలలు డిజిటల్ హంగులతో ఆకట్టుకుంటున్నాయి. బ్లాక్ బోర్డుపై చాక్‌పీస్‌తో రాసే విధానానికి ప్రస్తుతం స్వస్తి పలికారు. పూర్తిగా డిజిటల్ బోధనే కొనసాగించేందుకు చర్యలు చేపట్టారు. అందుకు అనుగుణంగా హైస్కూల్స్‌లో ఐఎఫ్‌పీ ద్వారా, ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీల ద్వారా విద్యాబోధన చేస్తున్నారు. ఈ పరికరాలకు ఇంటర్నెట్ అనుసంధానం చేశారు. అలాగే బైజూస్ కంటెంట్‌తో పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. దీనిపై ఉన్నత విద్యాశాఖ అధికారులు ఇప్పటికే ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ కూడా ఇచ్చారు.

ఉపయోగం ఇలా..

తరగతి గదిలోని విద్యార్థులకు ఉపాధ్యాయులు వీడియో ద్వారా పాఠ్యాంశాలు బోధించడం వల్ల సులువగా అర్థమవుతోంది. అవసరమైన ప్రయోగాల కల్పనను నేరుగా డిజిటల్ స్క్రీన్‌పై చూపించే వెసులుబాటు వచ్చింది. అలాగే వీటిని బ్లాక్ బోర్డుగా ఉపయోగించుకోవచ్చు. రాసిన దానిని చేతితో సైతం చెరిపేయవచ్చు. ఇంటర్నెట్ ఉపయోగించి కంప్యూటర్ మాదిరిగా వాడుకోవచ్చు. యూట్యూబ్, ఫోన్, ట్యాబ్‌లలోని సమాచారాన్ని సైతం స్క్రీన్‌పై చూసే అవకాశం కూడా ఉంది.

చక్కగా అర్థమవుతున్నాయి



స్మార్ట్ టీవీల ద్వారా బోధించే పాఠ్యాంశాలు, వివిధ ఖండాల మ్యాప్‌లు చక్కగా అర్థమవుతున్నాయి.అర్థం కాకపోతే మరోసారి అడిగి తెలుసుకుంటున్నాం. గతంలో బోర్డుపై రాసి తుడిపి వేసిన తర్వాత అర్థం కాకపోతే ఇబ్బంది పడేవాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. బైజూస్ ద్వారా ఇంగ్లిష్, తెలుగు గ్రామర్‌ను సులువుగా నేర్చుకుంటున్నాం.

\- కె.సుధాపావని, 10వ తరగతి, జెడ్పీ బాలికల హైస్కూల్, గూడూరు

సులువుగా రాసుకుంటున్నాం



మ్యాథ్స్‌కు సంబంధించిన ఫార్ములాలు, సైన్స్ సబ్జెక్టులోని డ్రాయింగ్‌లు, సోషల్‌లో మ్యాప్‌లు వంటి నోట్స్ రాసుకోవడం సులువుగా మారింది. ఒక లెక్కను రెండు మూడు సార్లు ఉదాహరణలతో చేసి చూపిస్తున్నారు. సరిగా అర్థంకాకపోతే మరోసారి ఫొటోలను చూపించి మరీ వివరిస్తున్నారు.

\- కె.హర్షవర్ధన్, 10వ తరగతి, జెడ్పీ బాలుర హైస్కూల్, గూడూరు

చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం



విద్యార్థులకు సులభతరంగా పాఠాలు అర్థమయ్యేందుకు డిజిటల్ బోధన ఎంతగానో ఉపయోగపడుతోంది. పాఠశాలల్లో వీటి వినియోగం గొప్ప మార్పునకు సంకేతం. డిజిటల్ విధానంలో విద్యా బోధనపై ఉపాధ్యాయులకు పకడ్బందీగా శిక్షణ ఇచ్చాం. పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం.

\- శివప్రకాష్‌రెడ్డి, ఉప విద్యాశాఖాధికారి, గూడూరు